294

# 49. రుచిగల కథ

ఏ చక్కిలం ముక్కో నోట్లో వేసుకున్నప్పుడు పటుకూ పటుకూ మనిపించి నిమిషాల మీద గుటుకూ గుటుకూమనిపిస్తారు పిల్లలు. అదే తాం(డ్రముక్కో అయితే ఎక్కడ తొందరగా అయిపోతుందో అని అతి నెమ్మదిగా నాలుకకి పని చెప్పి, అప్పుడప్పుడు బుగ్గలో దాచుకుని, కాస్తకాస్తగా రసం పీల్చుకుని వీలైనంత ఎక్కువసేపు ఆ తీయదనాన్ని అనుభవిస్తారు.

ఎంత వయసొచ్చినా అమ్మని తలుచుకున్నప్పుడల్లా నా ఆలోచనలు అలాగే ఉంటాయి. దాచుకుని అనుభవించిన కొద్దీ మనసును మధురమయం చేస్తాయి అవి.

మేం నలుగురు అప్పచెల్లెళ్లం. మాకు సరిగ్గా మధ్యగా తమ్ముడు ఒకడూ. ఎవరి మటుకు వాళ్ళవి, ఆడామగా తేడాలేకుండా పెద్దపెద్ద చదువులు. 'వాళ్లవి' అని ఎందుకన్నానంటే ఆ చదువనే పదార్థం నాకెంత మాత్రమూ వంటపట్టలేదుగనుక.

ఆఖరికి తమ్ముడూ, చెల్లెలూ, అలా పైపైకి మెట్లెక్కినట్టు ఎక్కెస్తూంటే ఎప్పటికప్పుడు జారి పడడమే నావంతుగా మిగిలింది గనుక. చేతకాని తనంతో ఏర్పడిన న్యూనతాభావంతో ఎన్ని ప్రయత్నాలైనా మరింత దిగజారేలా చేసేవి గనక.

ఆడపిల్లల చదువుల్ని ఇంతగా ప్రోత్సహించిన మనిషి కాబట్టి నాన్నగారి ఆధునిక దృక్పథం గురించి మీకు వేరే చెప్పనక్కర్లేదు. చదువులేకాదు, అలా చదువుకుంటున్నప్పుడు ఓ క్లాసుమేటు ప్రేమించో, ఉద్యోగం చేసున్నప్పుడు కొలీగు ఇష్టపడో మా అక్కలిద్దరికీ కట్నప్రసక్తిలేని ప్రేమ వివాహాలు జరిగిపోవడం మా నాన్నగారి ఆదర్శాన్ని మరింత ప్రోత్సహించింది.

ఆ ఉత్సాహంతో చెల్లెల్ని ఐ.ఏ.ఎస్. చేయిస్తాననేవారు. తమ్ముడికెలాగా ఇంజనీరింగులో సీటు రానే వచ్చింది. నాకంటె రెండేళ్లు చిన్నదైనా అందుకనే మా నీరజకి మంచి సంబంధం వచ్చింది. ఎప్పుడూ లేన్ది మా అమ్మ అడ్డుపడినా మా నాన్న దాని పెళ్లి అయిందనిపించారు.

ఇక ఇట్టే వెళ్లి అట్టే వాళ్ళ ప్రొఫెసరు కూతుర్ని రిజిస్టరు మేరేజి చేసుకురావడంతో మా తమ్ముడు వెనకాడనూ లేదు. మొదట్లో మొరాయించినా మా అమ్మకీ నాన్నకీ వాళ్ళని దీవించకా, ఇంటికి రప్పించకా తప్పలేదు.

ఏ ఇరవై ఏళ్ళకిందో జరిగిన ఈ సంఘటనలన్నీ నిన్నో మొన్నో జరిగినట్టు ఉంటాయి. నా అదృష్టం బాగుండి మంచి ఇంట్లోపడి ఇప్పుడిలా కబుర్లు చెబుతున్నాను గాని చదువురాని మొద్దుననీ ఉత్తి బడుద్దాయిననీ ఆ రోజుల్లో అందరి కన్న ఎక్కువగా నేను కుమిలిపోయేదాన్ని.

తోడబుట్టినవాళ్లూ, నాన్నగారూ వేళాకోళం రూపాన నన్ను నానా చిత్రహింసలకూ గురి చేస్తూంటే నన్ను ఆదరించి సేదతీర్చింది అమ్మ ఒక్కతే. అందుకే అంతులేని ఆ అభిమానాన్ని ఎప్పటికప్పుడు తిరగతోడుకోవడం.

అప్పటికింకా ఆంధ్రామెట్రిక్ ప్రైవేటుగా పాల్గొనే అవకాశం ఉండేది. ఆ ఏడు బాగా జ్ఞాపకం. నేను నాలుగోసారి ఆ పరీక్షకు వెడుతూంటే నాన్న అమ్మతో ఏమన్నారో నేను వినకపోలేదు.

"నయానా భయానా ఎన్ని చెప్పినా దీనికోముక్క ఎక్కే దారి కనబడడం లేదు. దీనికి బుద్ధొచ్చే మార్గమేదో ఆలోచించి ఉంచాను. ఈసారి నీ పేర అప్లికేషన్ పంపించాను. అన్నిటికన్న సుళువుగా బుర్ర కెక్కే సబ్జెక్టు బుక్సు దానికోసం ఎలాగా తెప్పించాను కదా.

ఇంగ్లీషూ తెలుగూ కాక అవే గ్రూపు సబ్జక్టు నీ అప్లికేషన్‌లో రాశాను. హిస్టరీ సివిక్సూనూ. ఇదివరకు వచ్చిన పరీక్షాపత్రాలూ ఆన్సర్లూ అన్నీ ఉన్న గైడ్సు దాని కోసం తెప్పించినవి ఉన్నాయి. నువ్వీసారి పరీక్షకి కూచో........ నిమషాల మీద పాసవుతావని నమ్మకం ఉంది. తనముందు తన తల్లే పరీక్ష పాసయితేగాని మనబుద్ధావతారానికి జ్ఞానోదయంకాదు"

మా అమ్మ ఏం జవాబు చెప్పిందో వినే స్థితిలో లేనంతగా సిగ్గుతో బుగ్గయిపోయాను నేను. ఆ క్షణమే ఏ బండరాయో కట్టుకుని ఏ గోదావరిలోనో దిగిపోదామన్నంత విరక్తి కలిగింది.

చెప్పాను కదా ఆ రోజు బాగాగుర్తని. ఇంట్లో నా గదిలో నేనొక్కర్తినీ నిద్ర రాకుండా దొర్లుతున్నాను. అక్కలిద్దరూ ఎప్పుడో పెళ్ళిళ్లయి వేరింటి కాపరాల్లో, వాళ్లిద్దరూ కూడా ఉద్యోగాల్లో ఊపిరి తిరగనంత బిజీగా ఉన్నారు.

నీరజ హాస్టల్లో ఉండి చదువుకుంటోంది. తమ్ముడు సరే యూనివర్సిటీలో ఫైనలియర్ వెలిగిస్తున్నాడు. సరిసరి మీకు చెప్పనే లేదు కాబోలు, అప్పటికి కూడా మా నాన్న ఏవేవో డిపార్ట్‌మెంట్ టెస్టులకి కడుతూనే ఉన్నారు!

మా ఇంటికొచ్చిన వారెవరైనా 'అయ్యో మీ లలిత కింకా పెళ్లేకాలేదుట కదూ' అన్న మాట వరసకైనా అనడానికి ముందుకిరారు. ఎందుకంటే ఆ మాట ఇలా చెవిన పడిందా మా నాన్న రేపు పెట్టేస్తారు. 'మీ లలితకి ఈ ఏడాదికూడా పరీక్ష పోయిందటకదూ' అంటే సంతోషిస్తారనుకుంటాను.

ఎందుకు చెబుతున్నానంటే ఇంటి వాతావరణం ఇంతగా విద్యవైపు మొగ్గుచూపుతూన్న ఆ మధ్యనే పుట్టిన నాలో ఆ జీన్సు ఎందుకు మడతపడ్డాయని? ఇంతకీ ఒక్క తప్పయినా రాకుండా ఎన్ని పేజీలయినా తెలుగు రాయగలను నేను. ఇంగ్లీషూ అంతో ఇంతోవచ్చు. మరి లోపమెక్కడఉందని! నా రైటింగ్ బాగుండదు. అవును నా రాతే బాగులేదు.

తలుపు బిడాయించుకుని రెండ్రోజులపాటు తిండి తినకుండా ముడిచిపెట్టుకు పడుకున్నాను. మా అమ్మ బతిమాలిన కొద్దీ బిగదీసుకుపోయాను. ఈ సారి అడ్డగడియ కాకుండా తలుపుపైన ఉండే బోల్టు వేసేసుకుని ముసుగు తన్నేశాను. శరీరంలోని అణువణువూ ఆకలాకలని గోలచేసేస్తున్నా నిలదొక్కుకుని అక్కడే ఉండిపోయాను.

ఈ సారి అమ్మ తలుపు బాదడం స్పష్టంగా వినిపించింది. చూడు లల్లీనువ్వు చదువుకునేవు. మానేవు. తినేవు. మానేవు....... నాకు అనవసరం. ఇంట్లో నువ్వొక్కర్తివే కావు నేనున్నాను. ఇంకో అరగంటకో

గంటకో ఆవురావురని మీ నాన్న వస్తారు.

నేనా అనుకోకుండా జారిపడ్డాను. కాలుబెణికి సలిపేస్తోంది. వంటింట్లోకి వెడదామని రెండుసార్లు ప్రయత్నించినా వెర్రి తలనొప్పితో ఒళ్లు తూగిపోతోంది. సమయానికి ఆ పనిమనిషి సెలవపెట్టింది. దేనికీ ఓపికలేదు. గబుక్కని లేచి కొంచెం సాయం చెయ్యవే తల్లీ చటుక్కున లేచి కూచుని గబగబ తలుపు గడియలు తీసేశాను.

అన్నట్టు చదువుల గొడవలోపడి మా అమ్మ గురించి మీకు చెప్పనేలేదు కదూ. పొద్దుటో అరగంటా సాయంకాలం ఓ అరగంటా వచ్చి గిన్నెలు తోమి ఇల్లు ఊడ్చే పనిమనిషి తప్ప మా ఇంట్లో అన్ని పనులూ చేసుకునేది మా అమ్మే. ఇంత ఇంటినీ ఇందరు మనుషుల్నీ అలసట తోచనివ్వకుండా నిర్వహించుకొచ్చేది మా అమ్మే.

ఎవరి చదువుల తాపత్రయాల్లో వాళ్లుపడి మిగిలిన సభ్యులెవరికీ ఇంట్లో ఇటుపుల్ల అటుతీసి పెట్టే తీరికాలేదు, కోరికాలేదు. సరే, మొదట్నుంచీ చదువు పాడ అంటే కిట్టని నాకు స్కూల్లో లేనంత కాలం ఇంట్లో బోలెడంత తీరిక.

ఆ పనీ ఈ పనీ సాయపడి మా అమ్మ పని భారం తగ్గించాలని నాకెంతగానో ఉండేది కాని ఆవిడ ఏ మాత్రమైనా పడనిస్తేనా? 'కూరలు తరిగి ఇస్తానే' అనేదాన్ని, 'ఆరేసిన బట్టలు మడతపెడతానే' అనేదాన్ని, 'పెరుగు తోడిపెడతానే, పాలు కాచిపెడతానే, పోనీ కాఫీ డికాక్షనైనా వేస్తానే' అంటే వింటేనా! పోతావా పోవా అని గుడ్లురిమేది.

ఇంటెడు పనితో సతమతమౌతున్న కన్నతల్లికి కాస్త సాయం చేయలేకపోయానే అనే నిస్పృహయతే చదివింది బుర్రకెక్కకుండా చేసిందేమో........

మరదెందుకో నేను చెప్పలేను గాని వంటపనీ, గృహనిర్వహణా అంటే నాకు చాలా ఇష్టంగా ఉండేది. కడుపున పుట్టిన ఆడపిల్లలకైనా తల్లులు అన్ని పనులూ నేర్పుతారంటారు. మరి నాన్నగారి నిరంకుశత్వమో, మా అమ్మ సహకార నిరాకరణోద్యమమో మా అమ్మ మమ్మల్నెవ్వర్నీ తన దరిదాపులకి రాకుండా జాగర్తపడేది.

కాని ఏకలవ్యుల ఆరాధనాబలానికి దూరం కావడం ద్రోణాచార్యుల తరం కాదు. వద్దన్న కొద్దీ మా అమ్మ పనితీరుని మరింత శ్రద్ధగా సన్నిహితంగా గుర్తించేదాన్ని నేను. ఇంతకీ ఎంతటి ఆదర్శమూర్తులకైనా ఇంకొకరిమీద ఆధారపడే సంఘటనలను ఎదుర్కోక తప్పదు.

మా పెద్దక్క పురిటికివచ్చినప్పుడూ, మా నాన్నకి డబుల్ టైఫాయిడ్ వచ్చినప్పుడూ, మా అమ్మకే యూట్రెస్ తొలగించే ఆపరేషను అయినప్పుడూ నేను నిలదొక్కుకుని సాయపడినతీరు చూసి ఎవరో ఎందుకు మా అమ్మే ముక్కున వేలేసుకుంది! చెప్పకేం నా జీవితం ధన్యమయినట్టయింది. ధన్యం అనేది ఎందుకవుతుంది, జ్ఞానోదయం అయిన తర్వాతే కదా, అదేదో నాలో అయిందనిపించింది. చదువంటే ఏమిటి, డిగ్రీలమీద గిగ్రీలు తెచ్చుకోడమా, పదిమందికి ఉపయోగపడేలా మన బ్రతుకును

దిద్దుకోడమా అనే ప్రశ్న నాలో మొదలయింది. మెట్రిక్ పాసవలేదనే చింత క్రమంగా నాలో మరుగున పడజొచ్చింది.

ఆరోగ్యం బాగుపడిన అమ్మ ఎప్పట్లా చకచకా పనులు చేసేసుకుంటూంటే ఆ నేర్పరితనం ఆ మాత్రమైనా అందుకోలేనా అనే తపన. నాలో ప్రత్యేక పరిశీలనలగా రూపుదిద్దుకుంది.

అమ్మ గృహనిర్వహణలోని ఆనుపానులు పసిగట్టాననే తృప్తితో నాలోని ఆత్మన్యూనతా భావం ఇంచుమించు పటాపంచలైంది. నన్ను నేను తెలుసుకున్నాననే టర్నింగ్ పాయింట్‌లోనే అనుకోకుండా మా నాన్నగారు నా స్థానే మా అమ్మని మెట్రిక్‌కి కూచోపెడతాననే వార్త చెవినపడి నన్ను బాగా గాయపరచింది. నా చేతకానితనం దెబ్బ తీసినట్లై అలిగి గదిలో నా మనసు నలిగిపోయేలా చేసింది.

ఎప్పుడూ లేంది ఇవాళ అమ్మ తలుపు తట్టింది. కేవలం తలుపునే తట్టిందా, ఊహు నిద్రాణమైన నా తలపుని లేవగొట్టి నేనెవరో నా ముందు నిలబెట్టింది. తనంత తానుగా మొదటిసారిగా 'సాయం చెయ్యవే తల్లీ' అని అర్థించింది.

సాటిమనిషికి సాయపడడానికి మెట్రిక్ పాసై తీరాలా ఏం? నా కన్నతల్లి నా ఉనికిని గుర్తించింది, పీకపోయినా ఇంకొకర్నేమీ అడగని మనిషి రెండు చేతులా నా సాయం కోరింది. వెంటనే తలుపు తీస్తానా, నా సాయం ఎలాంటిదో చూపిస్తానా.

ఆకలితో పేగలు అరుస్తున్నాయని చెప్పను కదూ, ముందు వాటిని శాంతపరచడానికి గ్లూకోజ్ కలిపిన నిమ్మరసం పీకల మొయ్యా ఎక్కించాను. ఓ అరసోలడు బియ్యం కడిగి అర్జంటుగా గ్యాసు పొయ్యిమీది గిన్నెలో చేర్చాను.

తల్లికి తల్లినై ఒళ్లో పడుకోపెట్టుకుని తలకి అమృతాంజనం రాశాను. డాక్టరికి ఫోన్ చేసి రప్పించాను, మందులు గుప్పించాను. నాన్నగారు ఇల్లు చేరే అరగంటలోనే ఆయన మెచ్చుకునే పద్ధతిలో వండి వడ్డించాను. చేతకాని చవట అనుకున్నాం. దీనికన్నీ తెలుసునని ఇదివరకు ఎరగమే! అని వాళ్ళల్లో వాళ్లు ఆ మర్నాడు అనుకుంటూంటే వేరే డాక్టరేటెందుకనిపించింది.

తర్వాత్తర్వాత ఆలోచించి చూస్తే మనకి మనం ఆనరరీ డాక్టరేట్లు ఇచ్చేసుకోడం కాదు, గట్టిగా ప్రయత్నిస్తే చిన్నసైజు మెట్రిక్యులేటు సాధించలేమా అనిపించింది. సాధించాను కూడా. ఆ తర్వాతి నెలలోనే నాకు పెళ్లి జరిగింది.

మా పెద్దక్కా, చిన్నక్కా ఏమిటి, మా నీరజ ఏమిటి, కలుసుకున్నప్పుడల్లా నన్ను ఎగదోస్తూ ఉంటారు. ఎప్పటికైనా కళ్లు తెరిచి ఓహో అనిపించుకునే మార్కులతో పాసయ్యావు. ఎందుకు? పది మంది ఉన్న సమిష్టి కుటుంబంలో పడి రాత్రీ పగలూ చాకిరీ చేస్తూ ఒళ్లుహూనం చేసుకోవడానికా! ప్రైవేటుగా పై చదువులకి ఎందుకు ట్రై చెయ్యవు? నీ మొగుడు మెత్తనివాడని విన్నాం. కోరి చేసుకున్నాడు కదా...... కొంగున ఎందుకు దోపుకోవు? వేరింటి కాపురం పెట్టుకుని చెంగుచెంగున నీదారి నువ్వెందుకు

చూసుకోవు?

ఈ విషయం కూడా నేను బాగా ఆలోచించకపోలేదు. నేనింకా ఓ నిర్ణయానికి రాకుండానే మరో ముఖ్యవిషయం గుర్తుచేశారు.

చూడోసే లల్లీ! నెలకి ఇంతని అంట్లుతోమే అప్పలమ్మ గడిస్తోంది. వీధులు తుడిచే వెంకటమ్మ గణిస్తోంది. ఏ ఆడదైనా తనకాళ్లమీద తను నిలబడి గడించుకున్నప్పుడు మాత్రమే సుమా, వ్యక్తిత్వం అనేది నిలబడేది! మగాడి గాడిలో నీడలో ఆడది బానిసలా బతక్కుండా నిలబెట్టేది ఆర్థికపుష్టి ఒక్కటేనే! పట్టుపట్టిముందు గ్రాడ్యుయేషన్ చెయ్యి. ఆ తర్వాత ఏదో ఓ జాబ్ దొరక్కపోదు'

'వినదగునెవ్వరు చెప్పిన' అన్నారు. మానడమెందుకు? శాంతంగానే విన్నాను. నా మేలుకోరి తోడబుట్టిన వాళ్లు ఇచ్చిన సందేశం మళ్ళీ మళ్లీ మననం చేసుకున్నాను. ఇన్నేళ్లు గడిచినా ఇప్పటికి కూడా ఆ ఆలోచనల ఆటుపోట్లు నాకు తప్పలేదు.

ఎందుకంటే ఆడది మగాడికి సారధి అవునో కాదోగాని ఆ కుటుంబానికి వారధిమాత్రం అవును. సంస్కారమంటే ఏమిటో సాంప్రదాయం అంటే ఏమిటో తను తెలుసకుంటే చాలదు, తన పిల్లలు కది అందివ్వాలి. వీధిలో ముగ్గులు వెయ్యడం, ఇంటికి తోరణాలుకట్టడం ఇవి మాత్రమే ఓ జాతికి సంస్కృతి అనుకుంటే ఆ సంగతికి అంతకు మించిన అపకృతి మరొకటి ఉండదు.

నా క్షేమంకోసం మా అమ్మా నాన్నవాళ్లకి నచ్చిన తీరులో ప్రవర్తించారు. పిల్లల చదువులకోసం మా నాన్న చేసిన కృషి ఇంతా అంతాకాదు.

నాకు చదువు రావడం లేదని ప్రత్యేకించి పడిన పాట్లు ఇన్నీ అన్నీ కావు. ఆఫీసు పనితో అలసిపోయి ఏ రాత్రో ఇల్లు చేరినా ఓ గంట నాకు పాఠం చెబితే గాని నిద్రపోయే వారు కారు.

మాస్టర్లని మార్చేవారు, బజారుకి ఏ నోట్సువస్తే అది కొనిచ్చేవారు. తక్కిన పిల్లల్లా కాక ఓ కొరకరాని కొయ్యలా తయారై నేనెంతో ఇబ్బంది పెట్టినా ఆఖరికి మా అమ్మని నా చదువుకి పోటీగా పెట్టి నాకు వేడిక్కెంచారు.

ఇక మా అమ్మ చేసిన తోడ్పాటు అంతా పరోక్షమైనది. అయిదుగురు పిల్లలకీ మొగుడికీ ఎప్పటికేది కావాలో అమర్చడంలో ఆవిడ గొప్పదనం పైకి కనపడని సరస్వతీ నదిలాంటిది. అయితే ఈ రోజు నేను వేసే ప్రశ్న చదువకునే ప్రయత్నం ఆవిడ మటుకు ఆవిడ ఎందుకు చెయ్యలేదు? మా ఇంటి ఆడపిల్లల దృష్టిలో తనంతట తాను ఎంతో కొంత సంపాదించి తన కాళ్ళ మీద నిలబడే ప్రయత్నం ఎందుకు చెయ్యలేదు? అలా చెయ్యనంత మాత్రాన ఆవిడకోల్పోయినదేమిటి!

మా అమ్మ మీద వేసుకున్న నా ఈ సూటి ప్రశ్నకు జవాబు లేదు. ఆవిడ బానిసలా బతికిందని నేనేకాదు మా అక్కలే ఒప్పుకోరు. ఇంట్లో ఎప్పుడూ ఆవిడస్థానం బానిసగా కాదు, ఏలికగానే! ఆమె ఎవరికీ పాఠాలు చెప్పిన రుజువులేదు. అయినా ఇంటిల్లిపాదికీ ఆవిడ గురువే.

ఇప్పుడు మా నాన్నా లేరు. అమ్మా లేదు. వాళ్లు చెప్పిన లేక చెప్పని పాఠాలు మా

ముందున్నాయి. ముందు మా నాన్నగారి పాఠాలు విని పరీక్షలు పాసై ఉద్యోగాలు చేస్తున్న మా సోదరీమణుల సంసారాలు చూద్దాం.

పెద్దబావకి స్టేట్‌బ్యాంక్‌లో క్యాషియర్ ఉద్యోగం. ఒక్కర్తేకూతురు గనుక ఆయనజీతం, వాళ్ళ నాన్నకి వచ్చే అయిదువేల పెన్షనూ వాళ్లకి చాలు. అయినా పెద్దక్క మేథమెటిక్స్ లెక్చరర్‌గా ఓ ప్రైవేటు కాలేజీలో చేస్తూ పదివేలు తెస్తుంది. కూతుర్ని ఊళ్లోనే రెసిడెన్షియల్ కాలేజి హాస్టల్లో పెట్టారు. వీళ్లతో సర్దుకోలేక అత్తమామలు పెన్షన్ డబ్బులిచ్చి పై ఊళ్లో ఓల్డేజి హోంలో ఉంటున్నారు.

చినబావ స్కూలు టీచరు. చిన్నక్క బ్యూటీక్లినిక్ నడుపుతోంది. బజార్లోకి దిగిన ఏ కొత్త పరికరమైనా వాళ్లింట్లో ఉండవలసిందే. ఏదైనా ఇన్‌స్టాల్‌మెంటు మీదే తెస్తారు. కొత్తగా ఎపార్ట్‌మెంట్‌కి అడ్వాన్స్ ఇచ్చారు. అయిదో తారీకు దాటితే చేతిలో పైస ఉండదు. ఇద్దరు కొడుకులు.

నీరజ ఏదో హోటల్లో రిసెప్షనిష్టుగా ఉందిట. జీతం బాగా ఎక్కువేగాని బాగా పొద్దుబోయాకగాని ఇల్లుచేరదు. మరిది పట్టించుకోడు గాని వాళ్ల అమ్మా నాన్నా అలా ఏదో గొణుగుతూనే ఉంటార్ట. ఏ మాత్రం మనశ్శాంతి లేదని గోలపెడుతూ అది అలా ఉత్తరాలు రాస్తూనే ఉంటుంది.

ఇంత స్పష్టంగా చెప్పడానికి మా తమ్ముడి వివరాలు నాకంతగా తెలీదు. ఈ మధ్యనే ఇద్దరూ స్టేట్సు వెళ్ళిపోయారని విన్నాను. మా కులం పిల్ల కాకపోయినా గాని ఆ అమ్మాయే మా వాళ్ళ కంటె నయమేమో అని అప్పుడప్పుడనిపిస్తుంది.

ఇక నా గురించి చెబుతూ ఈ కథ ముగిస్తాను. నాన్న చెప్పిన పాఠాలు విని వాళ్లు జీవిస్తున్న విధానం అది. అమ్మ చెప్పని పాఠాలు గ్రహించి నేను నా సంసారం దిద్దుకున్న తీరు ఈ క్రిందిది.

మా అక్కలు చెప్పినట్టుగా మొగుడొక్కడేకాదు మావారి కుటుంబమంతా మెత్తనిదే. బాగా ముసిలాళ్లు అయిపోయారుగాని మా అత్తామామా వయసుకి తగ్గ ఆరోగ్యంగానే ఉన్నారనవచ్చు.

శరీర ఆరోగ్యం కంటె పదిమందితో సర్దుకోగల మానసిన ఆరోగ్యమే వాళ్లనలా సంతోషంతో నిలబెడుతోందేమో మరి! మా ఇద్దరు మరుదులూ ముగ్గురు ఆడపడుచులూ మాలాగే వాళ్లదీ పెద్ద సంసారమూ. ఈయనే ఇంటికి పెద్ద. ఒక్క చిన్న మరిదికీ చిన్నాడపడుచుకీ తప్ప అందరికీ పెళ్ళిళ్లయ్యాయి. ఇప్పటిమటుకు అంతా కలిసే ఉన్నా.ం ఉండగలమనే నమ్మకంతోనే ఉన్నాం.

పేరుకి మా అత్తగారే వంటపనికి పూచీ వహిస్తుందిగాని ఇంచుమించు పెత్తనమంతా నాదే. పెత్తనం అంటే వంటపనీ, గృహనిర్వహణా.

డబ్బు సైతం అంతా ఆయన చూసుకుంటారు. చార్టెడ్ ఎకౌంటెంట్‌గా ప్రాక్టీసు చేస్తున్నారు. బాగానే సంపాదిస్తున్నారని చెప్పొచ్చు. ఇంటిపెద్ద కొడుకుగా బాధ్యత స్వీకరించానే తృప్తి ఆయన్లో తొణికిసలాడుతూ ఉంటుంది.

ఇక చాలావరకు వంటింటిలోనే గడిచిపోతుంది నాకు. ఇంట్లో వాళ్ల అమ్మ ఉన్నా, ఆవిడ చెముడు గనక వెంటనే పలకలేదనో మరేమో, ఇంటిల్లిపాదీ నన్నే అమ్మా అనిపిలుస్తారు. మామగారితో

సహా. ఆ పిలుపులూ పలకరింపులూ తిండికి సంబంధించినవే అయినా నాకేమాత్రం వెగటుగా ఉండవు. ఇవాళ కూరేమిటి? వంటయిందా? కొంచెం పచ్చడి వేస్తావా అమ్మా, టిఫిన్ బాగారుచిగా కుదిరిందే! మొన్న చేశావ్ చూశావా అలాంటి బొబ్బట్లు మళ్ళీ చెయ్యవూ! కొంచెం ఊరగాయ పెడతారా అమ్మగారూ! తొందరగా కాఫీ కలిపియ్యి కాలేజ్ వేళయింది. ఆకలేస్తోందమ్మా!

ఇలాంటి పిలుపులు రోజూ చెవినపడే అన్నపూర్ణ నిజంగా ధన్యురాలు. చనువు ఉండాలే గాని ప్రేమ ప్రకటనలెన్ని రకాలని! అరుపులు, అలకలు, బెదిరింపులు, దెప్పులు, మెప్పులు, దెబ్బలాటలు, వేళాకోళాలు, వెక్కిరింతలు, అల్లర్లు ఇలా ఎన్నని! వీళ్ళందరి మధ్యా నిలదొక్కుకునే శక్తికలిగి ఉన్నానంటే అమ్మ నేర్పని పాఠం అదెంత గొప్పదని!

ఓ అయిదారుగురున్న కుటుంబంలోంచి కొన్ని సంఘటనలు ఉదాహరించి ఏదో సందేశాలు అందిస్తున్నానని మీరు భ్రమపడితే నేనేం చెప్పేది లేదు. ఎవరేం చెప్పినా వారికి తెలిసిన పరిమిత ప్రపంచంలోంచే. చదువుకున్న ఆడాళ్లని నేనేదో తూర్పారపట్టానని మీరనుకుంటే అది పొరపాటే.

విద్యగాని మరేదైనా ఇతర జ్ఞానంగాని వాటి మటుకవి చెడ్డవని ఎవరూ అనరు. మన జీవితాన్ని బాగుచేసుకోడానికి అవి ఏ విధంగా అన్వయించుకుంటున్నామో దాన్నిబట్టే మన భవిష్యత్తు ఉంటుంది. పొద్దుటలేచి హడావిడిగా కాలకృత్యాలు తీర్చుకుని ఆడామగా పిల్లా పెద్దా పరుగులు తీసి ఎనిమిదో గంటకల్లా తాళంపడే ఇళ్ళని చూస్తే మాత్రం గుండె గుభేలుమనకమానదు.

ఆడదానికిగాని మగాడికిగాని పొట్టకోస్తే అక్షరమ్ముక్క లేకపోవడం నిజంగా సిగ్గుచేటే. కాని ఇంటికొస్తే ఆదరించి ఇంత అన్నం ముద్దపెట్టే ఆడదిక్కు లేకపోతే మాత్రం ఆ జాతికి అధోగతే.

★